## క్లుప్తంగా

### పీజీ నీట్ పరీక్ష ప్రశాంతం



పెడన:మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన పీజీ నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, సెంటరు అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 164 మంది హాజరయ్యారని, 16 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతగా జరిగినట్లు పేర్కొన్నారు.

### నాగరాజుకు పేర్ని కిట్టు నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 39వ డివిజన్ కాసానిగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త పామర్తి నాగరాజు (42) ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. నాగరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగరాజు స్వగృహం వద్ద ఉన్న ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సందర్శించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే నాగరాజు ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం పార్టీకి తీరని లోటన్నారు. డివిజన్ కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, పాండు, ఉదయ్‌కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన భానుమతి



పెడన: ఉపాధ్యాయురాలిగా 30 సంవత్సరాలు పాటు ఎందరో విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్ది అనేక సేవాలను అందించిన బట్ట భానుమతి ఆ వృత్తికి వన్నె తీసుకువచ్చారని ఎంఈవో-1 దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక గుడివాడ రోడ్డులోని షాదిఖానాలో భానుమతి టీచర్ రిటైర్‌మెంట్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు కొనియాడారు. సహచర ఉపాధ్యాయులు, బంధువులు, ఎంఈవో కార్యాలయం సిబ్బంది, సీఆర్పీలు ఆమెను సత్కరించి సన్మానించి వీడ్కోలు పలికారు. విశ్రాంత హెచ్ఎం తేజోవతి, తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ ఘటం అమ్మవారికి వెండి చేతి తొడుగులు



పెడన:శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాతపేటలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లి ఘటం(చిన పైడమ్మ) అమ్మవారికి ఆదివారం వెండి చేతి తొడుగులను అందజేశారు. బట్ట ఆదిలక్ష్మీ కుమారులు, కూతురు, అల్లుడు వీటిని ఆలయ ధర్మకర్తలు తోటపైడేశ్వరరావు, నాగరాజుకు అందజేశారు.

### గాజుల అలంకారంలో గంగాభవానీ అమ్మవారు



కోడూరు:భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారికి ఆదివారం గాజులతో అలంకారం చేశారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఈ అలంకారం చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు కోమ్మూరి శ్రీనివాస శర్మ చెప్పారు. గర్భాలయంతో పాటు ఆలయ ప్రాంగణమంతా గాజుల తోరణాలతో ముస్తాబు చేశారు. అమ్మవారికి మూలమూర్తికి వివిధ రకాల పుష్పాలతో పూజలు చేసి, కుంకుమార్చన చేశారు. గాజుల అలంకారంలో అమ్మవారిని దర్శించుకొని భక్తులు పులకించారు. ధర్మకర్త కోట యుగంధరరావు పర్యవేక్షించారు.

# పశువుల సంచారంతో ప్రమాదాలు!



సీతనపల్లి సమీపంలో జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు



మునిపెడ సమీపంలో పశువును ఢీకొట్టి ధ్వంసమైన కారు (ఫైల్)

- జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా పశువులు
- నిత్యకృత్యంగా మారిన రోడ్డు ప్రమాదాలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

కృత్తివెన్ను:రోడ్డుపై మూగజీవాలు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన రైతుల నిర్లక్ష్యం కారణంగా ఎందరో వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతుండగా కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. కృత్తివెన్ను మండలంలో 216 జాతీయ రహదారి సుమారుగా 20 కిలోమీటర్లు పైనే విస్తరించి ఉంది. చినపాండ్రాక నుంచి పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు పల్లెపాలెం వరకు ఇది విస్తరించింది. ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు చక్కగా ఉండటంతో వాహనాలు వేగం కూడా అంతే స్థాయిలో ఉంటుంది. ఈ క్రమంలో రోడ్డుపైకి పశువులు అధికంగా రావడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

### పశువులను తప్పించబోయి.....

రోడ్డుపైకి పశువు రావడంతో అధిక స్పీడ్‌లో ఉన్న వాహనం షడన్‌గా వచ్చిన పశువును తప్పించబోయి పల్టీలు కొట్టడం, ద్విచక్ర వాహనదారులైతే పశువును ఢీ కొట్టి రోడ్డుపై పడిపోవడం సర్వసాధారణమయ్యాయి. ఇటువంటి సమయంలో ఎందరో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న వ్యక్తులు సైతం ప్రాణాలు కోల్పోయిన సంఘటనలో చాలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం మునిపెడ సమీపంలో పెళ్లికి వెళుతున్న కారు గేదెను ఢీ కొట్టడంతో కారులో ఉన్న పెళ్లికుమార్తె తల్లి ప్రాణాలు కోల్పోగా, కారులోని వ్యక్తులు గాయపడ్డారు. మిలేష్ కంపెనీ సమీపంలో గేదెలు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. క్షతగాత్రుల సంగతైనే చెప్పనక్కర లేదు. ఈ వేసవి సీజన్‌లో దాదాపు 35 నుంచి 40 వరకు యాక్సిడెంట్లు పశువుల కారణంగానే రోడ్డుపై జరిగినట్లు తెలిసింది.

### ఇలా వదిలేస్తే ఎలా?

రోడ్డుపైకి పశువుల రాకుండా అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి. పశువు వల్ల వాహనదారులకు నష్టం జరిగితే దానికి పశువు యజమానిని సైతం బాధ్యుల్ని చేస్తామని హెచ్చరించాలి. లేకపోతే ఏమీ తెలియని పశువుల వల్ల ఎందరో ప్రమాదల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు మాట్లాడుతూ వేసవి కాలంలో పశువుల తాకిడి రోడ్డుపై ఎక్కువగా ఉంటుందని, జాతీయ రహదారి సమీప గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు కూడా తీసుకున్నామన్నారు.

## దీవించమ్మా.. నాంచారమ్మా

**విశ్వనాథపల్లిలో శ్రావణమాస పూజలు**



ప్రత్యేక అలంకారంలో నాంచారమ్మ



అమ్మవారికి అభిషేకించే జలాలకు పూజలు చేస్తున్న పండితులు

కోడూరు:కృష్ణా తీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ఆదివారం జలాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మూలమూర్తికి పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం 108 బిందెల కృష్ణమ్మ నీటిని ఆలయం చుట్టూ ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ నీటితో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులే స్వయంగా అభిషేకాలు చేసేందుకు అవకాశం కల్పించారు. అమ్మవారి పుట్టింటివారిగా చెప్పబడే గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభిషేకాల్లో పాల్గొన్నారు. నాంచారమ్మ మూలమూర్తికి చందనంతో చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ప్రధానార్చకుడు ఘంటసాల పార్థసారథి పూజలు చేయగా, ఆలయ అధికారిణి జయశ్రీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గంగానమ్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం



అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తున్న యార్లగడ్డ వంశీకులు

మేళ్లమర్తిలంక(మోపిదేవి):గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగానమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. అందులో భాగంగా ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, కుంకురారోపణ, పంచగవ్యప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 200 సంవత్సరాల క్రితం స్వయంభుగా బయట పడిన గంగానమ్మ అమ్మవారిని సోమవారం ఉదయం 8 గంటలకు పునఃప్రతిష్టించనున్నారు. గంగానమ్మ అమ్మవారిని, పోతురాజు స్వామివారిని మేళతాళాలతో ఊరేగింపుగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, వారంతా ప్రత్యేక వాహనంలో ఆలయంకు చేరుకున్నారు. అనంతరం వేదమంత్రాలతో అమ్మవారు, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మంట ఆరాధన, అమ్మవారి మంత్ర హోమం, ధాన్యాధివాసం, పుష్పాదివాసం, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. 4వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు విగ్రహ పునఃప్రతిష్టా ఉత్సవం నిర్వహించనున్నట్లు యార్లగడ్డ వంశీకులు సోమశేఖర ప్రసాద్ (లంకబాబు) తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



అన్నదానం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మోపిదేవి:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయంకు చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. క్యూలైన్‌లన్నీ భక్తులతో బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళిశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. స్వామివారి శాంతి కళ్యాణం, అన్నప్రసాదం, సర్పదోష నివారణా ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బురదమయంగా అంతర్గత రహదారి



బురదమయంగా మారిన రహదారిని చూపుతున్న గ్రామస్తులు

కోడూరు:బురదమయంగా మారిన రహదారిపై ప్రయాణించేందుకు నరకయాతన పడుతున్నట్లు విశ్వనాథపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలోని భజంత్రీల కాలనీలో సుమారు 100 కుటుంబాల వారు నివాసముంటున్నారు. అయితే వీరు కాలనీలో నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే అంతర్గత రహదారి అధ్వానంగా మారింది. వర్షాలకు రహదారి బురదమయంగా మారి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా మారింది. మోకాలి లోతు దిగి ప్రధాన రహదారిపైకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. కాలనీలోకి ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. సీసీ రహదారి నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు మొర్రపెట్టుకున్న పట్టించుకున్నవారే కరువయ్యారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కాలనీలోకి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ఏటిపాయలో తగ్గుముఖం పట్టిన వరద



పడవలపై కూలీ పనులకు వెళ్లి వస్తున్న మద్దూరు వాసులు

కంకిపాడు: ఏటిపాయలో వరద తగ్గుముఖం పట్టింది. ఏటిపాయలో నీటి ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ ఉధృతి తగ్గింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలో వెళ్తున్న కృష్ణానది ఏటిపాయ ఆదివారం నాటికి పది అడుగుల మేర వెనక్కివెళ్లింది. అయితే నేటికీ మద్దూరు వద్ద ఏటిపాయ నుంచి లంక భూముల్లోకి వెళ్లే మార్గం బయటపడలేదు. ఆ ప్రాంతం వరకూ నిండుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో పంట పొలాల్లో కూలీ పనులకు వెళ్లే కూలీలు పడవలను ఆశ్రయించి పనులకు వెళ్లి వస్తున్నారు.

### వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల నియామకాలు



బంటుమిల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి నియామకాలు ఆదివారం నుంచి ప్రారంభించినట్లు మండల పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆముదాలపల్లిలో జరిగిన గ్రామ పార్టీ సమావేశంలో కమిటి కన్వీనరుగా ఈదా నాంచారయ్యతోపాటు కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగం కన్వీనరు తిరుమాని శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పల్లికొండ శివ, బీసి సెల్, రైతు విభాగం మండల కన్వీనర్లు జొన్నలగడ్డ పాండురంగారావు, సుజ్ఞానం జనార్ధనరావు, ఏఎంసీ మాజి వైస్ ఛైర్మన్ పాలడుగు బాబూరావు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పాపారావుకు రమేష్‌బాబు నివాళి

చల్లపల్లి:లక్ష్మీపురం కేసీపీ చక్కెర కర్మాగారం యూనియన్ నాయకునిగా, కార్మికుల, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన నాయకులు మిక్కిలినేని పాపారావు (92) శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు ఆదివారం ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు మిక్కిలినేని మధును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింహాద్రి రమేష్‌బాబుతోపాటు పార్టీ చల్లపల్లి, ఘంటసాల మండలాల కన్వీనర్లు శీరం సత్యనారాయణ, వేమూరి వెంకట్రావు, జిల్లా నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అర్షద్, పీఏసీఎస్ మాజీ ప్రెసిడెంట్ పాగోలు నాగసీతారామరావు, నాయకులు మత్తి రాంబాబు తదితరులు నివాళులర్పించారు.

### స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రేపు ధర్నా

గూడూరు:స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం గూడూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి కె.వి.గోపాలరావు తెలిపారు. ప్రజలకు భారంగా మారే స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు అన్ని వర్గాల వారు తరలిరావాలని ఆయన కోరారు.

### నేటి నుంచి మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్

గన్నవరం రూరల్: ప్రజారోగ్య పరిరక్షణకు సిద్ధార్థ అకాడమీ పునరంకితం అవుతుందని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవిరావు అన్నారు. ఆదివారం కళాశాల కౌన్సిల్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ కళాశాల ప్రాంగణంలో మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభిస్తారు. అకాడమి ప్రతినిధులు పాల్గొంటారు. వారం రోజుల పాటు ప్రవేశం ఉచితమన్నారు. ప్రధానంగా సిద్ధార్థ అకాడమి 1975లో ప్రారంభమై గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకుంటోందని, ఆనాడు నాణ్యమైన విద్య అందరికి అందించాలన్న లక్ష్యంతో ఈ రోజుకు 18 విద్యా సంస్థలు నడుస్తున్నాయని చెప్పారు. ప్రజలకు ఖరీదైన విద్య, వైద్యం అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవటం అకాడమి లక్ష్యమన్నారు. చిన అవుటపల్లిలో మెడికల్ కళాశాల, బోధన ఆస్పత్రి, డెంటల్, నర్సింగ్, నర్సింగ్ స్కూల్, పారా మెడికల్ అందుబాటులోకి తెచ్చామన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

## చలో విజయవాడ జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహమ్మద్ కరీముల్లా

శ్రీకాకుళం(ఘంటసాల): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా పిలుపునిచ్చారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, కొడాలి, ఘంటసాల గ్రామాల్లోని విద్యుత్తు సబ్ స్టేషన్లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఆదివారం కలసి చలో విజయవాడ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం అందర్నీ రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.46 వేలు చెల్లించాలని, 2022 పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, నూతన షిఫ్టు ఆపరేటర్లకు, వాచ్‌మెన్స్‌గా పని చేస్తూ షిఫ్టు ఆపరేటర్లగా నియమించబడిన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. షిఫ్టు ఆపరేటర్ పి.వీరబాబు, ఆయా సబ్ స్టేషన్ల వద్ద షిఫ్టు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలో హాకీకి ప్రోత్సాహం



క్రీడాకారులను అభినందిస్తున్న హాకీ అసోసియేషన్ ప్రతినిధులు

గూడూరు:జాతీయ క్రీడ అయిన హాకీని పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సాహించే దిశగా కృష్ణా జిల్లా హాకీ అసోసియేషన్ కృషి చేస్తుందని సంఘ జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు హాకీ క్లబ్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 5 హాకీ క్లబ్‌లు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో హాకీని ప్రోత్సాహిస్తున్నామని చెప్పారు. పాఠశాల స్థాయిలో జూనియర్, సబ్ జూనియర్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ పోటీలల్లో కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో గూడూరు హైస్కూలు విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని తెలిపారు. హాకీకి పూర్వ వైభవం తెచ్చేందుకు క్లబ్ స్థాయి నుంచి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గూడూరు క్లబ్ అధ్యక్షుడు మోటేపల్లి రత్నారావు, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రవణం హరికృష్ణ, కోశాధికారి విఠల్, గూడూరు క్లబ్ ఉపాధ్యక్షుడు ఎం.ఎ.సలీమ్, ప్రధాన కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, కోశాధికారి నిమ్మగడ్డ దుర్గాప్రసాద్, పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్; పోతన సుధాకర్, గాజుల గంగాధర్, అల్లంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాకీలో రాణిస్తున్న గూడూరు క్రీడాకారులను వారు అభినందించారు.

## తీవ్ర సంక్షోభంలో చేనేత పరిశ్రమ

**దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఊటుకూరు సుబ్రహ్మణ్యం**



దేవాంగ బాంధవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఊటుకూరు సుబ్రహ్మణ్యం

గూడూరు:దేవాంగుల కులవృత్తి అయిన చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరు సుబ్రమ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని పోలవరంలో దేవాంగ బాంధవుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. దేవాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో దేవాంగ సంక్షేమ సంఘం ముందుంటుందని చెప్పారు. దేవాంగులకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాంగులు ఐక్యత ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించగలమని చెప్పారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నక్కిన చిన వెంకట్రాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా దేవాంగుల సంక్షేమం కోసం కృషి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కార్పొరేషన్ పదవుల ఊసు లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దేవాంగ కార్పొరేషన్‌లో నియామకాలు చేపట్టకుంటే పోరుబాట చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్, కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ బండారు ఆనంద ప్రసాద్, ఎర్ర శ్రీనివాస్ కుమార్, సర్పంచి నక్కిన వెంకట నాగరాజు, కారుపర్తి రత్నం, కారుపర్తి గగన్, పడవలమోహన త్రినాథ్, పోలవరం, ఐదుగుళ్లపల్లి, మల్లవోలు దేవాంగులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం



వీఆర్వో చిన్నారిని సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామప్రముఖులు



ఏఈఓ నీలిమను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

కోడూరు:మండలంలోని ఉల్లిపాలెం సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను ఆదివారం సత్కరించారు. గ్రామ సర్పంచ్ వెర్రీ పావని ఆధ్వర్యంలో ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో విధులు నిర్వహించిన వీఆర్వో చిన్నారి, ఫిషరీస్ అసిస్టెంట్ కోలా నరేంద్ర, ఏఈఓ పిల్లి నీలిమ, డిజిటల్ అసిస్టెంట్ సనకా శంకర్, ఏఎన్ఎం కృష్ణవేణి, సర్వేయర్ కడవకొల్లు నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ సీతయ్యను శాలువాలతో సత్కరించి, పూలబొకే అందించారు. సచివాలయంలో వీరు అందించిన సేవలను సర్పంచ్ కొనియాడారు. ఎంపీటీసీ సనకా శైలజ, గ్రామప్రముఖులు వెర్రీ శ్రీనివాసరావు, కుటుంబరావు, కమ్మిలి కోటేశ్వరరావు, సనకా రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి సందేశ కరపత్రాలు పంపిణీ



ఘంటసాలలో శాంతి సందేశ కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఘంటసాల:శాంతి, సౌభ్రాతృత్వం కోసం అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ కృషి చేస్తుందని కమ్యూనిటీ నూరుల్ ఇస్లాం శాఖ ప్రజా సంబంధాల అధికారి ముహమ్మద్ జావిద్ అహ్మద్ పాషా అన్నారు. ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఉమ్మడి కృష్ణా జిల్లాల పర్యటనలో భాగంగా ఘంటసాలకు ఆదివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం కోసం సమ్మేళనాలు, సెమినార్లు, చర్చా గోష్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని మతాలను పరస్పరం గౌరవించినప్పుడే నిజమైన శాంతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యాకూబ్ పాషా మాట్లాడుతూ ఈ కమ్యూనిటీని 1889లో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్‌లో స్థాపించారని చెప్పారు. మహమ్మద్ ఇస్మాయిల్, ఖాసీం, అక్బర్, అహ్మద్ పాల్గొన్నారు.

### నేటి నుంచి వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు

బంటుమిల్లి: స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు సోమవారం నుంచి మొదలు అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనము, దీక్షధారణ, అంకురారోపణ తదితర పూజలతో పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 4వ తేదీ నుంచి 7 వరకు పవిత్రోత్సవాలు, హోమాలు, 8న సామూహిక కుంకుమపూజ, 9న స్వామివారి శాంతికల్యాణం, అన్నసమారాధన జరుగుతాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు తమ పేర్లను ఆలయ అర్చకుల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.